# ‘సీనియర్ల’కు గోఎయిర్ ఉచిత విమానయానం



ముంబాయి: ఆరు దశాబ్దాల భారత స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని ‘గోఎయిర్’ విమానయాన సంస్థ 60 ఏళ్ళు, అంతకు మించి వయసున్న పౌరులకు గౌరవసూచకంగా ఉచిత విమానయాన సదుపాయం కల్పించనుంది. ఈ నెల 8 నుంచి అందుబాటులో ఉండే ఈ సదుపాయాన్ని వినియోగించదలచుకున్న సీనియర్ సిటిజన్లు తమ వయసు ధ్రువీకరణను చూపి, ప్రయాణానికి రెండు రోజులు ముందుగా టిక్కెట్లను రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపింది. గోఎయిర్ విమాన సర్వీసులు అందుబాటులో ఉండే 11 నగరాలకు (అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కొచ్చిన్, ఢిల్లీ, గోవా, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, ముంబాయి, శ్రీనగర్) ఈ నెల 10 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు సీనియర్ సిటిజన్లు పన్నులు, సర్‌చార్జీలు మాత్రం చెల్లించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని గో ఎయిర్ తెలిపింది. ‘మనందరికీ గర్వకారణమైన నేటి భారత్‌ను నిర్మించటంలో తమ వంతు పాత్రను పోషించిన గౌరవ పెద్దలందరికీ ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని జోహార్లు అర్పిస్తున్నట్లు’ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జే వాడియా ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని సీనియర్ సిటిజన్‌లలో 80 శాతం దాకా విమానమెక్కని వారే ఉన్నందున గోఎయిర్ వారికి ఈ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.